

ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద భారీ లోడుతో వెళుతున్న లారీ



ఓవర్‌లోడ్‌తో గుంటూరు-పర్చూరు పాతమద్రాసు రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

‘ఓవర్’లోడ్

ప్రత్తిపాడు: గుంటూరు-పర్చూరు రోడ్డులో భారీ వాహనాలు ఇష్టారీతిన తిరుగుతున్నాయి. పరిమితికి మించి లారీలపై లోడు నింపుకుని చిన్న చిన్న రోడ్లలో ప్రమాదకరంగా తిరుగుతున్నాయి. మితిమీరిన ఎత్తు సరుకును నింపుతుండటంతో ఎక్కడ విద్యుత్ తీగలు తెగి ప్రజల మీద పడతాయో అర్థంకాని పరిస్థితి. అంతేకాకుండా ఓవర్‌లోడ్‌తో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే భారీ లోడుతో వెళుతున్న వాహనాలు ఎక్కడ అదుపుతప్పి తమ మీద పడతాయోనన్న భయాందోళనలు ప్రయాణికుల్లో కనిపిస్తుంది. ఇప్పటికైనా రవాణాశాఖ అధికారులు స్పందించి ఓవర్‌లోడ్‌కు కళ్లెం వేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: నియోజకవర్గంలోని కార్యకర్తలకు ఎల్లప్పుడు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని మాచవరంలో ఇటీవల హత్యకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్త దేవరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ములుకుదురులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మూడో వార్డు మెంబర్ ముద్రబోయిన శ్రీనివాస్‌ను పరామర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన గాయంవారిపాలేనికి చెందిన మామిళ్లపల్లి రమేష్, ఆయన కుమారుడును పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వైద్యుడిపై అసత్య ఆరోపణలు తగదు



పొన్నూరు: వైద్య వృత్తిలో ఉండి పేద వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి పఠాన్ ఫిరోజ్‌ఖాన్‌పై కేసు నమోదు చేయమని న్యాయవాదులు డిమాండ్ చేయడం అన్యాయమని పట్టణ ముస్లిం నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అంజుమన్ షాదీ ఖానాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒక వైద్యుడికి కుల, మత, ప్రాంతాలతో సంబంధం లేకుండా ప్రజా సేవకే అంకితమై విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై అసత్య ఆరోపణలతో కేసు నమోదు చేయమని కోరడం సమంజసం కాదన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే న్యాయం కోసం పోరాడే గౌరవ వృత్తిలో ఉన్న న్యాయవాదులు వైద్య రంగాన్ని గౌరవించాలని కోరారు. నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలలో అన్ని వేళలా అందుబాటులో ఉండి పేదలకు వైద్యసేవలందిస్తున్న వైద్యుడిపై చేస్తున్న అభియోగాలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో షేక్ రహంతుల్లా, సయ్యద్ బక్షి, షేక్ రఫీ, షేక్ బాబు, షేక్ నిజాముద్దీన్, షేక్ తాజు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు



రేటూరు(కాకుమాను): గ్రామాలలో కౌలు రైతు కార్డు కలిగిన ప్రతి కౌలు రైతుకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని గుంటూరు లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి అన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని రేటూరు, బోడిపాలెం గ్రామాలలో కౌలు రైతులకు వ్యవసాయ పంట రుణాల మంజూరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతు కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ భూ యజమాని పంటపై రుణం తీసుకోకపోతే కౌలు రైతులకు రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. కౌలు రైతు కార్డు కలిగిన వారు ఐదుగురు రైతుమిత్ర గ్రూపులుగా ఏర్పడితే అటువంటి వారికి రుణాలు మంజూరు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి శిక్షణ కేంద్రం మేనేజర్ బ్రహ్మానంద కుమార్, పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి, ఏఓ కె.కిరణ్మయి, కాకుమాను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

రీ సర్వే పైలట్ గ్రామంగా అనుమర్లపూడి



పెదకాకాని: మండలంలో అనుమర్లపూడి గ్రామాన్ని రి సర్వే పైలట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు తహసీల్దార్ కృష్ణకాంత్ తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, హద్దులను నిర్ణయిస్తున్నారని చెప్పారు. ఈనెల 20వ తేదీ నుంచి ప్రైవేట్ వ్యవసాయ భూములు ప్రతి ఒక్క రైతుకి నోటీసు ద్వారా టామ్ టామ్ ద్వారా తెలియజేసి కొలతలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో అనుమర్లపూడి గ్రామ రీ సర్వే పూర్తయిన వెంటనే రీ సర్వే జరుగుతుందని తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో సర్వేయర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాలలో ఎన్‌టీఆర్ స్థానం పదిలం

విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

చేబ్రోలు: తెలుగు ప్రజల హృదయాలలో ఎన్‌టీఆర్ ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచే ఉంటారని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌యూనివర్సిటీలో ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు సినీ పరిశ్రమలో ఒక గొప్ప నటుడిగా ప్రతి పాత్రలో జీవం పోసి, ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారన్నారు. ప్రజలతో కూడా ఆయనకున్న అనుబంధం ప్రత్యేకమని, అందరూ ప్రేమించే నాయకుడిగా ఎదిగారని వెల్లడించారు. ఆయనకు నివాళిగా లైబ్రరీకి ఎన్‌టీఆర్ పేరునే పెట్టామన్నారు.



పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న చైర్మన్ లావు రత్తయ్య

లైబ్రరీలో దాదాపు రూ.10 కోట్లు విలువ చేసే పుస్తకాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంచామన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు: తెలుగు ప్రజల గుండెల్లో నందమూరి తారకరామారావు ఎప్పుడూ చిరస్మరణీయంగా నిలిచే ఉంటారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ప్రత్తిపాడు శాలివాహన బజారులో, కోయవారిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెమ్మసాని రవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొన్నూరు: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణం ఐలాండ్ సెంటర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోయవారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

కాకుమాను: మండలంలోని కొమ్మూరులో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

శంకరవిలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభం

నెహ్రూ నగర్: నగరంలో పెరిగిన ట్రాఫిక్ నియంత్రణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరంలోని శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మించేందుకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నగర పాలక సంస్థ తరఫున చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు శనివారం నుంచి ప్రారంభించినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 134 ఆస్తులలో బ్రాడీపేట అరండల్ పేటలకు సంబంధించిన 99 భవన యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. 14 ప్రభుత్వ భవనాలకు, 21 మిషనరీ ఆస్తులకు రోడ్డు విస్తరణకు గాను నోటీసులు అందజేశామన్నారు.



నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

ప్రైవేట్ భవన యజమానులు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలను నగర పాలక సంస్థకు అందజేశారన్నారు. విస్తరణలో వారి ఆస్తి అర్హతను బట్టి భవన యజమానులకు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని వివరించారు. తొలుతగా నగర పాలక సంస్థ రోడ్డు విస్తరణ క్రమంలో భవన తొలగింపు కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభించిందని, అంగీకార పత్రాలు అందించిన బిల్డింగ్ నంబర్ 119, క్లాస్ 4 ఎంప్లాయీస్ అసోసియేషన్ తాలూకు గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న ఆరు షాపులు ఫస్ట్ ఫ్లోర్లను అసోసియేషన్ భవనం విస్తరణలో కోల్పోతున్న క్రమంలో శనివారం జీఎంసీ ఆధ్వర్యంలో కూల్చివేత పనులు ప్రారంభించారు. ఆర్‌ఓబీ నిర్మాణం కోసం ఈ రోడ్డు విస్తరణ పనులు నిరంతరంగా జరుగుతాయని, విస్తరణలో మార్కింగ్ ప్రకారం వారి ఆస్తి విలువను బట్టి భవన యజమానులకు కోల్పోయిన భవనాల కింద నష్టపరిహారం, స్థలం విలువనకు 4 రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లను అందజేయుట జరుగుతుందని వెల్లడించారు.

కరోనాతో మృతి చెందిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి

గుంటూరు మెడికల్: కరోనా సమయములో మృతిచెందిన ఉపాధ్యాయుల పిల్లలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. 2020లో కరోనా బారిన పడి చనిపోయిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల పిల్లలకు నేటి వరకు ఉద్యోగ, ఉపాధి కల్పించకపోవడం దారుణమన్నారు. కారుణ్య నియామకాలు కింద పంచాయతీ రాజ్ శాఖలో ఎక్కువ మంది ఉండడం వలన అక్కడ ఉద్యోగుల ఖాళీలు లేకపోవడం వలన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 110 నుంచి 150 మంది వరకు ఉపాధ్యాయుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు లేక వారి కుటుంబ సభ్యుల జీవితాలు చాలా దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం స్థానిక సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు స్థానిక సంస్థల లోనే ఉద్యోగం కల్పించాలని నిబంధనలు, ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఉత్తర్వులను వన్ టైం సెటిల్మెంట్ కింద సడలించి, కారుణ్య నియామకాల కింద నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లాషాఖాదిరి, జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నగరశాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, నగర శాఖ కోశాధికారి శ్రీనివాస్, నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్ బాషా

నగరంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

పట్నంబజారు: రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం గుంటూరు నగరంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా నెహ్రూ యువ కేంద్ర ద్వారా జిల్లా ట్రాఫిక్ వలంటీర్లు పేరుతో ఆసక్తి కలిగిన 25 మంది యువతను ఎంపిక చేసి వారికి రహదారి భద్రత నియమాల గురించి అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బి.గోపాల్, సౌజన్య, గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, తదితరులు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గుజ్జనగుండ్లలో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్ ఆధ్వర్యంలో మున్సిపల్ ట్రావెలర్ బంగ్లా సెంటర్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లైసెన్సు, హెల్మెట్, వాహన ధ్రువీకరణ పత్రాలు, వాహనాలు నిలువరించి జరిమానాలు విధించారు. 20 చలానాలకు సంబంధించి రూ.21 వేలు, డ్రైవింగ్ లైసెన్సు లేని 20 మందికి రూ. 20 వేలు, అధిక లోడు వాహనాలకు రూ.20 వేలు జరిమానా విధించారు. జిల్లా ట్రాఫిక్ వలంటీర్లకు గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ అవగాహన సదస్సు నిర్వహించి ప్రజలకు ఏవిధంగా ట్రాఫిక్ అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

నగరాభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ భాగస్వామ్యం అవసరం

కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరాభివృద్ధి, స్వచ్ఛత కార్యక్రమాల్లో సీనియర్ సిటిజన్స్ భాగస్వామ్యం ఎంతో అవసరమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా సీనియర్ సిటిజన్స్‌ను నాయుడుపేటలోని నగర పాలక సంస్థ లెగసి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఎక్స్పోజర్ విజిట్ చేయించి వ్యర్థాల నుంచి పవర్‌ను తయారు చేసే విధానాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతపై ప్రతి నెల ఒక అంశాన్ని తీసుకుని, ఆ అంశానికి అనుగుణంగా ఉండేలా అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజలను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా నగరంలోని సీనియర్ సిటిజన్స్‌ను నాయుడుపేటలోని నగర పాలక సంస్థ లెగసి, జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను చూపించినట్లు వివరించారు. నగర పాలక సంస్థ డోర్ టు డోర్ సేకరించిన చెత్తను ఏవిధంగా ప్రాసెసింగ్ చేసి వ్యర్థాల నుంచి విద్యుత్‌ను తయారు చేస్తారో వివరించారు. ఆయా కార్పొరేషన్లు మునిసిపాలిటీలకు వ్యర్థాల నిర్వహణ భారం తగ్గుతుందని చెప్పారు. స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.



జిందాల్ ప్లాంట్‌పై సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

అలాగే ఎన్‌హెచ్ 5 రోడ్ల పక్కన పడి ఉన్న ప్లాస్టిక్ చెత్త వ్యర్థాలను సీనియర్ సిటిజన్స్, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి కమిషనర్ తొలగించారు. ప్రతి 3వ శనివారం నగర పాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారులు సర్వీస్ రోడ్లపై ఉన్న ఉన్న చెత్త ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంహెచ్ఓ డాక్టర్ అమృత, ఎంహెచ్ఓ డాక్టర్ రవి బాబు, బయాలజిస్ట్ మధుసూదనరావు, ఈఈలు కోటేశ్వరరావు, సుందరరామిరెడ్డి, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ గుంటూరు లిమిటెడ్ ఎ.పి.ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఎంవీ చారి పాల్గొన్నారు.

21న చేబ్రోలు మండల పరిషత్ సమావేశం

చేబ్రోలు: మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం ఈ నెల 21వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత శనివారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షతన నిర్వహించనున్న సర్వసభ్య సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, ఇతర అంశాల గురించి చర్చ జరుగుతుందని చెప్పారు. సమావేశానికి మండల పరిధిలోని అందరూ ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

పొన్నూరులో స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్



పొన్నూరు పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు



ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాల గురించి వివరిస్తున్న ఎంపీడీఓ యుగకీర్తి



ప్రత్తిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ శివపార్వతి

పొన్నూరు: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించి, పట్టణాన్ని స్వచ్ఛ పొన్నూరుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు అన్నారు. శనివారం పట్టణంలో ‘స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్’ కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రతి ఇల్లు, ఇంటి చుట్టుపక్కల పరిసరాలు, షాపులు, కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ కవర్లు వాడకం తగ్గించాలని, మరుగు దొడ్లు ఏర్పాటు చేసుకుని వాటిని ఉపయోగించాలని తెలిపారు. తడి చెత్త- పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. రోడ్లు, మురుగు కాలువలలో వ్యర్థాలను వేయరాదని కోరారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. పొన్నూరు ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ అజిత కుమారి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు.

ములుకుదురులో..

మండలంలోని ములుకుదురు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, ఎంపీడీఓ జి.చంద్రశేఖర్ పాల్గొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. స్వచ్ఛతకు చేపట్టాల్సిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం

ప్రత్తిపాడు: గ్రామాల్లో స్వచ్ఛతకు పంచాయతీలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ కె.శివపార్వతి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండు వరకు నినాదాలతో ర్యాలీ చేశారు. పాతమల్లాయపాలెం కూడలిలో స్వచ్ఛత యొక్క ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్వచ్ఛతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయన్నారు. అందులో భాగంగానే ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛత దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడా అపరిశుభ్ర వాతావరణం లేకుండా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వి.లాజర్, సీడీపీఓ వి.సుజాతదేవి, ఎంఈఓలు రమాదేవి, లీలారాణి, ఈఓపీఆర్డీ రవికుమార్, ఏఓ అరుణకుమారి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ లలిత, తహసీల్దారు శ్రీనివాసశర్మ

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రతి అధికారి పని చేయాలి

కాకుమాను: మండలంలోని అన్ని శాఖల అధికారులు స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పని చేసి మండలాన్ని స్వచ్ఛ మండలంగా మార్చడానికి కృషి చేయాలని ఎంపీడీఓ కె.యుగకీర్తి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాకుమాను, చినలింగాయపాలెం గ్రామాలలో శనివారం స్వచ్ఛ గ్రామాలు, ప్లాస్టిక్ రహిత గ్రామాలపై ఆయా గ్రామాలలోని పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, కాకుమాను, చినలింగాయపాలెం సర్పంచులు పసుపులేటి శివకుమారి, యోహోను, ఎంపీటీసీ సభ్యుడు ఏసేబు, ఈఓపీఆర్‌డీ రవి కుమార్, ఏపీఓ కె.సింగారావు, ఏపీఎం సుజాత పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కార్యాలయ చుట్టు ఉన్న మొక్కలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటస్వామి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

చేబ్రోలు: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చేబ్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.లలిత అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిలో ఫ్లెక్సీలు, ప్లేకార్డులు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జీబీసీ రహదారిలో నిర్వహించిన ర్యాలీలో ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది నినాదాలు చేశారు. చేయి చేయి కలుపుదాం - స్వచ్ఛ చేబ్రోలు మండలాన్ని సాధిద్దాం అంటూ నినదించారు. ఎంపీడీఓ కె.లలిత, తహసీల్దారు కె.శ్రీనివాస శర్మ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఉమాదేవి పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో..

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ శనివారం నిర్వహించారు. పెదకాకాని శివాలయంలో సిబ్బంది ఆలయ ప్రాంగణంలో పలు ప్రదేశాలు శుభ్రం చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ద్విచక్ర వాహనం చోరీపై నగరంపాలెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బ్రాడీపేటకు చెందిన కొమ్మాలపాటి నిషిత్, ఈనెల 5వ తేదీన రమేష్ ఆస్పత్రిలో బంధువులను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి పార్కింగ్ చేసి ఆస్పత్రిలోకి వెళ్లాడు. కొంత సేపటికి బయటకు వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల రైల్వే స్టేషన్, బస్టాండ్, పరిసర ప్రాంతాలలో వెతుకలాడిన వాహనం కనిపించలేదు. దీంతో శనివారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్యాగరాజ కీర్తనలతో పురవీధుల్లో శోభాయాత్ర

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం రెండో వీధిలోని శ్రీ త్యాగరాజ కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం నిర్వహిస్తున్న సద్గురు శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు శనివారం మూడో రోజుకి చేరాయి. సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో శ్రీకాంత్ బృందం మంగళవాద్యంతో ప్రారంభించారు. పురవీధుల్లో శోభాయాత్ర చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

చేబ్రోలు: కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపానికి గురైన యువకుడు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన చేబ్రోలు గ్రామ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు శ్యామలానగర్ 12వ లైన్‌కు చెందిన ఓబులలంక సంతోష్‌కుమార్ (28) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కొమ్మమూరు చానల్ సమీపంలో రావిచెట్టుకు నల్ల కండువాతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో ఎస్ఐ డి.వెంకట కృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని వివరాల సేకరించారు. సూసైట్ నోట్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

లక్ష్మీపురం: నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్న వాహనాన్ని పట్టాభిపురం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్యామలానగర్ రైల్వే గేటు వద్ద పట్టాభిపురం పోలీసులు తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో ఎస్టీ కాలనీకి చెందిన మేడా నాగేశ్వరరావు ఓ ఆటోలో సుమారు 800 కిలోల బియ్యాన్ని తరలిస్తున్నాడు. గమనించిన పోలీసులు అదుపులో తీసుకుని ఆటోను, మేడా నాగేశ్వరరావును స్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న సివిల్ సప్లై డెప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ ఖాదర్ బేగ్ పరిశీలించి, బియ్యంగా ధ్రువీకరించి బియ్యాన్ని సీజ్ చేశారు. డెప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు పద్యాలపై ఉచిత శిక్షణ

నగరంపాలెం: బ్రాడీపేట సీపీఎం కార్యాలయ ఆవరణలో శనివారం తెలుగు కావ్య మథనం (పూసపాటి పద్య పాఠశాల) ద్వితీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సభకు సమూహ వ్యవస్థాపకుడు పూసపాటి కృష్ణసూర్య కుమార్ అధ్యక్షత వహించారు. వాట్సప్ మాధ్యమం ద్వారా తెలుగు పద్యాలు ఉచితంగా శిక్షణ పొందగా, పదమూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా రావి రంగారావు, ఆత్మీయ అతిథులుగా సూర్యదేవర రవికుమార్, కంది శంకరయ్య ప్రసంగించారు. పూసపాటి చేపట్టిన సినిమా క్విజ్ అందరిని ఆకట్టుకుంది. సుమారు వంద మంది ఉపాధ్యాయులు హాజరవ్వగా, గతేడాది ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు అవార్డులు అందించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ప్రత్తిపాడు డివిజన్

90109 57733 (ప్రత్తిపాడు)

90109 62225 (పొన్నూరు)

Office mail : sakshigntadvt@gmail.com